కథానిక

# తెగిన అడ్డంకులు

"కనక్ ప్రవాసి"

"ఈ నాన్న మనకొద్దే! అమ్మా! అమ్మా! పోదామే" అన్నాడు కుర్రాడు ప్రాధేయపడుతూ.

"నువ్వూ! నీ కొడుకూ!" సాగదీశాడు. "కుర్రాడిని అట్లా తయారుచేశావు" పెళ్ళామ్మీద ఉరుముతూ అన్నాడు భర్త. అట్లా అన్నా కూడా కసిమాత్రం తీరలేదు. కోపం రెచ్చిపోయింది. అతను ఒక్క నిమిషం కూడా భార్య తనముందు నిలబడివుండటం ఇక సహించలేకపోయినాడు. వెఱ్ఱికోపంతో 'ఛెళ్ళు'న ఒకటి వేశాడు. బాబిగాడు బిత్తరపోయి చూస్తూ తల్లి చీరకొంగు పట్టుకొని వణుకుతున్నాడు.

ఆవిడ కళ్ళనీళ్లు తుడుచుకొని రామనారాయణ ముఖంలోనికి చూచింది. ఆ చూపునుండీ తప్పించుకొని మరో గదిలోకి పోయాడు రామనారాయణ. ఆ చూపుతో అతని మనస్సు కొంచెం కలవరపడ్డది. తమాయించుకొన లేకపోయినాడు. తను భార్యను కొట్టాడు ఆవేశంలో. తన ప్రవర్తనలో తనకే అనుమానం కలగనారంభించిం దిప్పుడు. ఆమెనెందుకు కొట్టాడో ఇప్పుడతనికి అర్థం కావటం లేదు. చిన్నతనంనుంచి తనింతవరకూ లోకంలో ఏం సాధించాడు?

సామాన్య సంసారంలోనే పుట్టాడు. ఎవరి దయతోనైతేనేం ఎమ్. ఎ. వరకూ చదువుకున్నాడు. కాలేజీలో లెక్చరర్ ఉద్యోగం సంపాదించుకున్నాడు. డబ్బుగల ఇంటిపిల్లనే పెళ్ళి చేసికొన్నాడు. సూర్యకాంతం పెద్ద అందమైనది కాకపోయినప్పటికీ ఆమెలో ఒక ప్రత్యేకత అతనికి కనిపించింది. ఆమెకు కొన్ని విషయాల్లో వుండే ఓదార్పు, నిజం నిజంగా వెలిబుచ్చటం వంటివి, రామనారాయణ తన హద్దులనుమీరిపోయేట్లు చేశాయి. ఆమెమాట్లాడే తీరు అతనికి బాధకలిగించేది కాని, ఆమె కుళ్లూ కపటంలేని మనిషి. అతను చిన్నతనంలో పడ్డ అవస్థలు ఇప్పటి సహనశక్తిని క్షీణింప చేస్తున్నాయి. విరుద్ధమైన ఉద్రిక్త స్వభావం గల మనిషి. ఆడవాళ్ళ తప్పులపట్ల సహనం బహు తక్కువ అతనికి.

సూర్యకాంతం కాపరానికి వచ్చిన కొత్తలో సంసారం ఎంతో అందంగా ఆనందంగా గడిచిపోయింది. అప్పుడు తను తెచ్చే డబ్బు పుష్కలంగా సరిపోయేది. తనకు బాధ్యతే లేనట్లు వుండేది రామనారాయణకు. శంకరం పుట్టాక రామనారాయణ తనంతటి అదృష్టవంతుడూ సౌఖ్యవంతుడూ మరొకడు లోకంలో వుండడు అనుకొన్న రోజులు చాలా వున్నాయి. జీవితంలో ఇక ఒడిదుడుకులే వుండవనిపించిం దతనికి—కాని పరిస్థితులు అతన్ని క్రుంగదీశాయి. అట్లా అవుతుందని కలలో కూడా అనుకోలేదు. పొరపాటున ఊహించనైనా లేదు. అట్లాంటిది ఉద్యోగం కాస్తా పోయింది. మరో ఉద్యోగం అంత సులువుగా రాలేదు. ఆ పరిస్థితిలో సూర్యకాంతం డబ్బుగల ఇంటినుంచివచ్చినా, పరిస్థితిని అవగాహన చేసికొని ఓర్పుగలది కాబట్టి తదనుగుణంగా సరిపెట్టుకొనేది. రామనారాయణ మాత్రం ఆ విషయంలో తట్టుకొనలేకపోతున్నాడు. ఎదురీదటానికి ప్రయత్నించడు. తన సంసారంగూర్చి చాలా అసంతృప్తి పడ్డాడు. కావలసిన వాళ్ళందరినీ ఒక్కొక్కరినే తన దృక్పథంనుండి నెట్టివేస్తున్నాడు. ఉద్యోగం కోసం తిరిగితిరిగి వస్తాడు. ఇంటి ముఖం చూచేటప్పటికి అతనికి బాధవస్తుంది. కోపం ఉద్రేకం పోట్లాడతాయి. ఇంట్లో అయిదు నిముషాలు ఉండటం ముళ్ళమీద వున్నట్టుంటుంది. దయ తల్చటం, సానుభూతి ప్రకటిం

చటం పరమ అసహ్యం అతనికి. అతన్ని బాగా చదివినది కాబట్టి సూర్యకాంతం ఆ విషయాల్లో తెలివిగా తప్పించుకొనేది. ఆ స్వభావం కూడ అతన్ని ఉద్రిక్తపరచేది.

ఉద్యోగ ప్రయత్నంలో విసుగెత్తి, పిచ్చెత్తి ఇంటికి వచ్చేసరికి కుర్రాడు భార్యను ఏదో కావాలని ఏడిపిస్తూంటే ఎద్దుకు సమాధానం చెప్పినదని రామనారాయణ సూర్యకాంతాన్ని కొట్టాడు. కొట్టిన తర్వాత ఆమెకు ఏడుపు రాలేదు. ఆశ్చర్యం కలిగింది. విశ్వాసం పోయింది. అతన్ని ప్రాధేయపడుతూ, ఓదార్చటానికి ప్రయత్నించింది. ఏడ్చింది, ఆడదికనక.

"నీ తెలివితక్కువనీ మూర్ఖతనీ సహించలేను. నీ దయ నాకవసరం లేదు. అందుకే నిన్ను తిట్టేది" అన్నాడు.

"తెలుసు" అని సౌమ్యంగానే జవాబిచ్చింది!

"తెలుస్తుంది, నువ్వు మీవాళ్ళింటికి నడు. మీవాళ్ళంతటి వెధవలు వుండరు ఎక్కడా. ఈ స్థితిలో వాళ్ళు నన్ను చూడకపోయినా నిన్నయినా చూస్తారు. వెళ్ళు" అన్నాడు ఎట్లాగైనా వదిలించుకుందామని.

సూర్యకాంతం వెళ్ళటానికి ఒప్పుకోలేదు. అతను బలవంతాన పంపేశాడు, ఎక్కడకు పోయినా సరే - అని. ఆమెను గురించి తనకిక బాధ్యతే లేనట్లు మాట్లాడాడు రామనారాయణ.

పుట్టింటికి వచ్చిన తర్వాతే సూర్యకాంతానికి రెండో కొడుకు విస్సిగాడు (విశ్వనాథం) పుట్టాడు. సూర్యాకాంతం పుట్టినింట్లో అందరికీ విస్సిగాడంటే ప్రాణం. ముఖ్యకారణాల్లో ఇవి కొన్ని కావచ్చు: వాడి మేనమామకు క్రాస్ వర్డ్ పజిల్ లో వాడు పుట్టిన తర్వాతే నాలుగు వేలు రావటం: సూర్యకాంతం తండ్రిని రిటైర్ అయిపోయినా తిరిగి ఉద్యోగంలో తీసుకోవటంతో ఆయనకూ తిరిగి నమ్మకం కలిగింది రెండు చేతులా తిరిగి ప్రజలనుంచిడబ్బు తినవచ్చునని. కాని, నారాయణ పరిస్థితిలోమాత్రం కించిత్తు మార్పుకూడ కనిపించలేదుఅతనికి సూర్యకాంతం చాలా వుత్తరాలు రాసింది కాని అవన్నీ తిరిగి వచ్చేశాయి. విస్సిగాడిని చూద్దామన్న ఆపేక్షకూడ రామనారాయణకు ఎందుకో లేకపోయింది.

సూర్యకాంతం వెళ్ళిపోయిన కొద్ది రోజుల వరకూ ఏ భారం లేనట్లు పక్షిమాదిరి స్వేచ్ఛననుభవించాడు రామనారాయణ. ఈ కొత్త ఉత్సాహం, ఆనందం అతన్ని అట్టేకాలం తృప్తిపరచలేకపోయాయి. ఒంటరితనం ప్రారంభమైనది. ఒంటరితనంలో భాగస్తుల కోసం వెదుకుతున్నాడు. ఎవరూ కనబడటంలేదతనికి. ఇంట్లో నలుగురూ మసులుతూంటే బాగుండుననే ఆలోచన అనాలోచితంగా కలిగేది. కలిగిన తర్వాత తన్ను తాను జ్ఞాపకం చేసికొనేవాడు. ఎగిరిచక్కా పోవటానికి బదులు, బలవంతంగా ఒదిలించుకుందామన్నా ఓపట్టాన ఒదిలేది కాదు ఆ ఆలోచన. అట్లాంటి ఆలోచనలు కలగకుండా వుంటే బాగుండు ననుకొనేవాడు. తెలియకుండా అట్లాంటి ఆలోచన కలిగినా లోబడటం ఏమాత్రం ఇష్టంలేదు రామనారాయణకు. ఇంట్లో సందడిగా వుంటే ఎంత బాగుండును, అనే ఆలోచనల తాలూకు ఛాయలు అతని మనస్సులో మెదుల్తున్నయి. సిగరెట్లతో కాలాన్ని ఖూనీచేస్తూ గడిపేసేవాడు. ఏ ఆలోచనా లేనిసమయాల్లో భార్యా పిల్లాడూ తన ముందు నిల్చొని ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నట్లనిపించేది. ఒక్కసారి కళ్ళు నులుముకొని తన్ను తాను చూసుకొనేవాడు. మనిషి కష్టాల్లోవున్నప్పుడు సమాధానానికి త్వరగా వస్తాడు. పట్టుదలలన్నీ నిమేషమాత్రంగా ఆనందాన్నిచ్చి మనిషిని యథాస్థితిలోనికి త్రోసివేస్తాయి. అట్లా అయిపోవటం రామనారాయణకు ఏమాత్రం ఇష్టం లేదు. సూర్యకాంతం తిరిగివస్తే బాగుండునని వుంది. కాని మళ్ళీ తన అసమగ్రతకు ఆమెను తిట్టున్నాడు.

రాత్రులు అయిదు నిమిషాల్లో అయిపోతే, 'రోజు ఒక నిమిషంగా మారిపోతే ఎంతో బాగుండునని వుంది. చిన్నచిన్న విషయాలు పెద్ద మార్పులకు దారితీస్తవి. అవి గుర్తించవలసినంతగా ముందు తోచవు. గుర్తించడం జరగదు కూడా. తదుపరి వాటి బలం ప్రబలంగా లోకంలో కాని తనలో కాని వుండటంతో తప్పనిసరిగా వాటిని గూర్చి వినాల్సి

వుంటుంది. పట్టించుకోక తప్పదు.

మూడు సంవత్సరాలు. కాని నిన్ననే ఆమెను విడిచిపెట్టినట్లు తోస్తున్నది. ఆడదానికి ఒళ్లు పట్టనంత పొగరు వుండకూడదు. అట్లాంటిదే వున్నట్లయితే ఇట్లాంటి గొడవలు తప్పవు. అయినా అయిందేదో అయిపోయింది. 'ఆమెను చూచిరావాలి అనే వుద్దేశం ఒక్కటే' తీవ్రంగా అతనిలో పనిచేయ నారంభించింది. అది సూర్యకాంతానికి ఆశ్చర్యంగా తోచవచ్చు. ఏమైనా నన్ను ఆమె ఆహ్వానించకుండా వుంటుందా. అనే రకరకాల ఆలోచనలు రైల్వే కంపార్టుమెంటులో మూల కూర్చున్న రామనారాయణకు కలిగాయి. స్టేషన్‌లో బండి ఆగినంత సేపూ అటూ ఇటూ కంగారుగా పోయే ట్రంకులూ, మూటలూ జనంకేసి చూస్తున్నాడు. పోయే రైలుకోసం జనం ఎక్కటానికి పడే తాపత్రయం విచిత్రమైన ఊహాలను లాక్కు వచ్చింది. తిరిగి రైలు కదిలింది. భార్యతో ఎట్లా మాట్లాడటానికి ఉపక్రమించటమా అన్న ఆలోచన. తనను దూషించదుకదా. లెక్కచేయదేమో! అనే మరో ఆలోచన. ఎట్లా జరుగనున్నదో అని భయం. మరునాడు సాయంకాలం రైలుదిగి రిక్షా ఎక్కాడు. ఎందుకో అతనికి వణుకు వచ్చింది. అతని కడుపులో ఊహాలబాధ. అత్తవారిల్లు సమీపించే కొలదీ భయం అధికమౌతున్నది, ఆత్మ ఏడిపిస్తున్నది తిరిగిపొమ్మని. కాని అణిగివున్న మూడేండ్ల క్రితం ఆపేక్ష తిరిగి చిగురించింది. ఇంట్లో అడుగుపెట్టి బరువైన నిట్టూర్పు విడిచాడు. ప్రాణానికి ఎంతో హాయిగా వుంది. బావమరుదులు ఎవరూ కనుపించలేదు. "అమ్మా! ఎవరో వచ్చారే!" అన్నాడు విస్సిగాడు తల్లితో. ఆ కుర్రాణ్ణి పుట్టాక రామనారాయణ చూళ్లేదు. సూర్యకాంతం ఆతురతగా గది గుమ్మందగ్గరకొచ్చి అతన్ని చూసింది. ముందు నమ్మలేదు. అతనుకూడ దీనంగా ఆపేక్షగా ఆమె హృదయంలోనికి చూచాడు. ఆమె పాలిపోయినట్లుంది. దుఃఖం, బాధతో, శరీరం వశంలేక పడిపోతూంటే, హృదయాంతరం నుండి పొంగువచ్చిన రామనారాయణ చివాలున వెళ్ళి పట్టుకున్నాడు. అనూహ్యమైన ఆకలయికకు ఆశ్చర్యపడుతూ అతని చేతుల్లో శిలా ప్రతిమలాగ వుండిపోయింది. వారికిక జీవితంలో ఎడబాటు మరిలేదనిపించింది. కాని ఆమెను ఆమె తెలుసుకొని అతన్ని త్రోసివేసి, తన బలిహీనతకు సిగ్గుపడుతూ దూరంగా నిల్చున్నది. ఆమెకు ఏడుపు ముంచుకువచ్చింది – పరీక్షించుకొనటం అత్యవసరంగా తోచింది.

రామనారాయణ అర్థం కాక వింతగా, శాంతంగా చూస్తున్నాడు. అతనేదో చెప్పాడు. కాని యేమీ వినబడలేదు. అతన్ని పరీక్షగా చూస్తున్నది సూర్యకాంతం. రామనారాయణలో ముసలి వాలకం గోచరించిందామెకు. కనుబొమ్మలవద్దా, బుగ్గలమీద బలమైన గీతల మాదిరి నొక్కులు కనిపించాయి. ఉంగరాల జుత్తులో నెరసిన వెంట్రుకలుకూడ. ఆమెను వెళ్ళగొట్టిన దగ్గరనుంచీ కొంచెం కొంచెంగా శాంతంగా చెప్పాడు. సూర్యకాంతం మౌనంగా విన్నది. తన సంగతి ఇంకా చెబుతూనే వున్నాడు. ఆమె కాలి బొటన వ్రేలితో నేలపై రాస్తూ ఇంకా రామనారాయణనుండి విన కుతూహలపడుతున్నది. రామనారాయణను విస్సిగాడు వింతగా చూస్తూ నిలబడ్డాడు. అమ్మకీ, ఆ వ్యక్తికీ మధ్య ఎట్లాంటి సంబంధమో వాడికి బోధపడలేదు. వాడిని ఎత్తుకొని రామనారాయణ సిగ్గుసిగ్గుగా ముద్దులాడాడు.

ఆ ఇంట్లో అతనికి చాలా కొత్తగా వుంది. భార్యతో ఏదో అవసరం వుండి కేకవేయదలచి ఏదో చెపుతాడు. కంగారుపడతాడు. మాట్లాడే ముందు చాలా ఆలోచించుకొని కాని మాట్లాడలేకపోతున్నాడు. శంకరం విస్సిగాడు కూడ అతన్ని తప్పుకు తప్పుకునే తిరుగుతున్నారు. బావమరుదులతోనూ మావగారితోనూ మాట్లాడుతున్నప్పుడు రామనారాయణకు సగం చచ్చినట్లు వుండేది. నెల్లాళ్లు పోయినాక అతనికి ఆ ఇల్లు మామూలైపోయింది.

అక్కడికే అతనికిసగం చచ్చినట్లు వుండటం వల్ల త్వరత్వరగా ఉద్యోగప్రయత్నం చేసికొని పెళ్ళాం పిల్లలతో బయలుదేరాడు. సాగనంపేటప్పుడు బావమరిది నవ్వినవవ్వు అతనికి జీవితం పొడుక్కీ తిరిగి తిరిగి బహురూపాల్లో బహుముఖాలుగా గోచరిస్తూ జ్ఞాపకం వస్తూనేవుంది.